# నమస్తే తెలంగాణ

## యాదాద్రి భువనగిరి

I నల్లగొండ, శుక్రవారం 11 ఏప్రిల్ 2025 | YADADRI BHUVANAGIRI


## ఎంజీయూలో కాంట్రాక్ట్ లెక్చరర్ల నిరసన



ఎంజీయూ ఆర్ట్స్ బ్లాక్ వద్ద ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

రామగిరి, ఏప్రిల్ 10 : యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రభు త్వం విడుదల చేసిన జీఓ 21ను రద్దు చేయాలని గురువారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకులు నిరసన చేపట్టారు. బుధవారం ఉన్నత విద్యా మండలికి వెళ్లిన అధ్యాపకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ ఆందోళన నిర్వహించారు. తమను క్రమబద్ధీకరించే వరకు కొత్త నోటిఫికేషన్ విడుదల చేయొద్దని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు చింత శ్యాంసుందర్, చిల్కూరి రమేశ్, ఎన్.భిక్షమయ్య, శ్రీనివాసులు, అమరేందర్, మశ్చేంద్ర, రవీందర్‌రెడ్డి, స్వప్న, జ్యోతి, మౌనిక, సమ్రీన్, అభిలాష పాల్గొన్నారు.

# 16న యాదాద్రికి కేటీఆర్



## భువనగిరిలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

### రజతోత్సవ సభపై దిశా నిర్దేశం చేయనున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్

### మాజీ ఎమ్మెల్యే పైళ్ల ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు

**బీఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లాకు రానున్నారు. ఈ నెల 16న భువనగిరి పట్టణంలో నిర్వహించనున్న బీఆర్ఎస్ శ్రేణుల సన్నాహక సమావేశానికి హాజరు కానున్నారు. ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభపై దిశానిర్దేశం చేయనున్నారు. ఈ మేరకు పార్టీ కేడర్ ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నది.**

*– యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ)*

బీఆర్ఎస్ ఆవిర్భవించి పాతికేండ్లు అవుతున్న సందర్భంగా రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఎల్కతుర్తిలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు స్వచ్ఛందంగా తరలించేలా ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో భువనగిరిలో సన్నాహక సమావేశం నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. దీనికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ బాధ్యులతోపాటు ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 3వేల మంది వరకు ముఖ్య నాయకులు తరలిరానున్నట్లు తెలుస్తున్నది.


**శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్న కేటీఆర్**

సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ శ్రేణులకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. ఒక్కో నియోజకవర్గం జన సమీకరణ, పెద్దసంఖ్యలో స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధమవుతున్న జనాన్ని తరలించేందుకు రవాణా ఏర్పాట్లు, సభపై ప్రచారం తదితర అంశాలపై మాట్లాడనున్నట్లు తెలుస్తున్నది.

వరంగల్‌కు దగ్గరగా ఉన్న నియోజకవర్గం కావడంతో పెద్దసంఖ్యలో కేడర్‌ను తరలించేలా కార్యాచరణ రూపొందించనున్నట్లు సమాచారం. గులాబీ శ్రేణుల్లో జోష్ నింపడంతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కేటీఆర్ ప్రసంగించనున్నట్లు ఆ పార్టీ నాయకులు చెప్తున్నారు.

**ముమ్మరంగా ఏర్పాట్లు..**

భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి నేతృత్వంలో సన్నాహక సమావేశం ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌ను బుక్ చేశారు. సుమారు 3వేల మంది వరకు హాజరయ్యే అవకాశం ఉందన్న అంచనాతో అందరికీ భోజన వసతి కల్పించనున్నారు. సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లపై శుక్రవారం శేఖర్‌రెడ్డితో ముఖ్య నేతలు సమావేశమై చర్చించనున్నారు. రజతోత్సవ సభకు ఒక్కో నియోజకవర్గం నుంచి 200 బస్సులు తరలివెళ్లనున్నాయి. ఆలేరు, భువనగిరికి సంబంధించి 400 బస్సులను ఇప్పటికే బుక్ చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కీలక నేతలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇప్పటికే భేటీ అయ్యారు. తొలుత మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి, గాదరి కిశోర్ కుమార్ సమావేశమయ్యారు. రెండో విడుతలో భాగంగా ఈ నెల 5న మిగతా నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలు చర్చించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై కేసీఆర్ దిశానిర్దేశం చేసిన సంగతి తెలిసిందే. కాగా, 16న భువనగిరి నిర్వహించనున్న సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు.



చివ్వెంల : పులితండాలో చాంపూలాల్ జాతరలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

## కేసీఆర్ సర్కారులోనే గిరిజనులకు ప్రాధాన్యం

- చాంపూలాల్ ఆశీస్సులు అందరిపై ఉండాలి
- పులితండాలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పూజలు

చివ్వెంల, ఏప్రిల్ 10 : తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాతే గిరిజనులకు ప్రాధాన్యం దక్కిందని, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో తండాలన్నీ గ్రామపంచాయతీలుగా రూపాంతరం చెందాయని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. చివ్వెంల మండలం పులితండాలో గిరిజనుల ఆరాధ్య దైవం చాంపూలాల్ జాతరలో గురువారం ఆయన పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కోట్లాది రూపాయలతో గిరిజన ఆవాసాలను అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దేనని గుర్తుచేశారు. చాంపూలాల్ ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జూలకంటి జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రౌతు నర్సింహారావు, ధరావత్ బాబునాయక్, నాగునాయక్ పాల్గొన్నారు. అనంతరం టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

## రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

- ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి
- కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత
- మాజీ జడ్పీ చైర్మన్ నరేందర్ రెడ్డి, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 10 : ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని నల్లగొండ జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జన సమీకరణపై గురువారం నార్కట్‌పల్లిలోని చిరుమర్తి క్యాంపు కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించినట్లే పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు మరోసారి సైనికుల్లా పని చేయాలని కోరారు. రజతోత్సవ సభకు పెద్దఎత్తున జనాన్ని తరలించాలని తెలిపారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చెప్పిన అబద్ధాలు నమ్మి ప్రజలు అధికారం ఇచ్చారని, కానీ ఇచ్చిన అవకాశాన్ని ఆ పార్టీ నాయకులు సద్వినియోగం చేసుకోక ఆగమాగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న నాయకుడు అధికార గర్వంతో పేగులు తీసి మెడలో వేసుకుంటా, లాగులో తొండలు వేయిస్తా, కాళ్లకింద వేసి తొక్కుతా అని వాఖ్యానిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై రోజురోజుకు ప్రజల్లో వ్యతిరేకత పెగుతున్నదని, మళ్లీ కేసీఆర్ పాలన కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రె ప్రభుత్వం అసమర్థతో ఆదాయం తగ్గిపోయిందని, హెసీయూ భూములు కొల్లగొటేందుకే సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. హైడ్రా పేరుతో ప్రభుత్వం పేదల ఇండ్లను కూల్చి వారి బతుకులను రోడ్డున పడేసిందన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను కంటికి రెప్పలా కాపాడిందని, అధికారం కోల్పోయినా తమకు ఓట్లు వేయలేదని ప్రజలను ఏనాడూ పట్టించుకోకుండా ఉండలేదని తెలిపారు. బీఆర్ఎస్ ఒక్కటే ఈ రాష్ట్ర ప్రజలకు రక్షణగా ఉంటుందని స్పష్టం చేశారు. వరంగల్ సభకు ప్రతి గ్రామ నుంచి జనం పండుగ వాతావరణంలో బయల్దేరాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు బైరెడ్డి కరుణాకర్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు యానాల అశోక్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కొండూరు శంకర్, మాజీ ఎంపీటీసీ మేకల రాజిరెడ్డి, నాయకులు కర్నాటి ఉపేందర్, దుబ్బ మధు, అలుగుబెల్లి సత్తిరెడ్డి, దోసపాటి విష్ణు, పసునూరి శ్రీనివాస్, బొబ్బలి మల్లేశ్, దేవేందర్, కార్తీక్, పుల్లెంల వెంకట్, ఫకీర్, సత్తి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

## తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

- బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి
- మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

మర్రిగూడ/(నాంపల్లి) ఏప్రిల్ 10 : తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షస పాలన కొనసాగిస్తున్నదని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం మర్రిగూడ, నాంపల్లి మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో లగచర్ల, మూసీ ప్రక్షాళన, హైడ్రా వంటి అనాలోచిత నిర్ణయాలతో ప్రభుత్వం అప్రతిష్ట పాలయ్యిందన్నారు. సన్నబియ్యం పంపిణీలో 35శాతం నూకలే వస్తున్నట్లు లబ్ధిదారులు చెప్తున్నారని తెలిపారు. సుమారు రూ.లక్షన్నర కోట్ల అప్పు చేసి సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి మూటలు పంపుతున్నాడని, రాష్ట్ర అభివృద్ధికి నిధులు వినియోగించడం లేదని ఆరోపించారు. మునుగోడు నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రారంభించిన పనులకే మళ్లీ కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్నారని విమర్శించారు. ఏప్రిల్ 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీటీసీ స్థానాల వారీగా అందుకు ఏర్పాట్లను చేసుకోవాలని సూచించారు. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్‌కు వస్తున్న ఆదరణను చూసి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడానికి ప్రభుత్వం భయపడుతున్నదని అన్నారు. మూడేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం రాబోతున్నదని, పార్టీ శ్రేణులు కష్టపడి పని చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మెండు మోహన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దంటు జగదీశ్వర్, సహకార చైర్మన్లు బాలం నర్సింహ, పందుల యాదయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు తోటకూరి శంకర్ యాదవ్, గుమ్మడపు నర్సింహారావు, నాయకులు బచ్చు రామకృష్ణ, రామిడి వెంకటరమణారెడ్డి, మునగాల వెంకటేశ్వర్ రావు, ఊరిపక్క నగేశ్, మారగోని వెంకటయ్య యాదవ్, నల్ల యాదయ్య, పోగు వెంకట్‌రెడ్డి, కడారి శ్రీశైలం, నక్క చంద్రశేఖర్, బాషిపాక రాములు, బుడిగపాక గోవర్ధన్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, ఇట్టం వెంకట్ రెడ్డి, చెర్కు లింగం గౌడ్, దేశిడి సురేందర్ రెడ్డి, కుంభం మాధవరెడ్డి పాల్గొన్నారు.


## కాంగ్రెస్ పార్టీది ప్రజా వ్యతిరేక పాలన

- ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం
- బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో సంతోషంగా ప్రజలు
- బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలి
- మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ నల్లగొడ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నాయకులు

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 10 : కాంగ్రెస్ పార్టీది ప్రజా వ్యతిరేక పాలన అని, రాష్ట్రంలో ఎక్కడ చూసినా సమస్యలు పేరుకుపోయాయని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఈ నెల 27న తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ పోస్టర్‌ను నియోజకవర్గ పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ సభకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు అభిమానులు, ఉద్యమకారులు పెద్దఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. రజతోత్సవ వేడుకల విజయవంతానికి ఈ నెల 13 నల్లగొండలోని లక్ష్మీగార్డెన్స్‌లో నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2001లో కేసీఆర్ ఒక్కడిగా బయటకు వచ్చి తెలంగాణ రాష్ట్రం కోసం లక్షల సైన్యాన్ని కదిలించారని గుర్తు చేశారు. 14 ఏండ్లు శ్రమించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని చెప్పారు. పదేండ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారని తెలిపారు. రైతు బంధు, రైతు బీమా, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, సాగు నీరు, 24 గంటల ఉచిత కరెంట్, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్ వంటివెన్నో అమలు చేసి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించారని అన్నారు. కానీ కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కష్టాలు మొదలయ్యాయని, నేటికీ ఆరు గ్యారెంటీలు అమలు కాలేదని విమర్శించారు. రూ. 15 వేల రైతు భరోసా, రెండు లక్షల రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రూ.4 వేల పెన్షన్ హామీ నెరవేర్చలేదన్నారు. యాసంగికి సాగు నీళ్లు ఇవ్వకపోవడంతో పంటలు ఎండిపోయాయని, పండిన కొద్దిమేర ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. నేటికీ చాలా చోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదన్నారు. ప్రభుత్వం, మంత్రుల నిర్లక్ష్యంతో నల్లగొండ జిల్లాలో ఒక్కో రైతు వేల రూపాయాలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ సైతం పలు సమస్యలపై ప్రజలు, ప్రతిపక్ష నేతల ఫోన్లు ఎత్తడం లేదని, మంత్రి వెంట తిరుగుతూ జనం సమస్యలను గాలికి వదిలేశారని ఆరోపించారు. గ్రామాల్లో సర్పంచ్‌లు లేక పాలన కుంటుపడిందని, కరెంట్ కోతలు మొదలయ్యాయని తెలిపారు. సమావేశంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ కటికం సత్తయ్య గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ వలీ, మాజీ ఏఎంసీ చైర్మన్ బొర్ర సుధాకర్, గ్రంథాలయ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు కరీం పాషా, బొజ్జ వెంకన్న, నారబోయిన భిక్షం, తండు సైదులు గౌడ్, తుమ్మల లింగస్వామి, పీఏసీఏస్ చైర్మన్లు వంగాల సహదేవరెడ్డి, దోటి శ్రీనివాస్, రవీందర్, కొండూరు సత్యనారాయణ, గాదె రాంరెడ్డి, జమాల్ ఖాద్రీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి, అయితగోని యాదయ్య, మారగోని గణేశ్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, జయప్రద, విమలమ్మ, గుండెబోయిన జంగయ్య, సందీప్‌రెడ్డి, బోనగిరి దేవేందర్, పేర్ల అశోక్, రమేశ్, నగేశ్, శ్రీనివాస్, జయపాల్ రెడ్డి, సైదులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత ఒంటెద్దు నరసింహారెడ్డి

## ఎల్కతుర్తి సభకు ప్రతి గ్రామం నుంచి తరలిరావాలి

- బీఆర్ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త నరసింహారెడ్డి

చింతలపాలెం, ఏప్రిల్ 10 : బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవం తం చేయడానికి ప్రతి గ్రామం నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున ఎల్కతుర్తికి తరలిరావాలని ఆ పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి అన్నారు. చింతలపాలెంలో గురువారం పార్టీ మండలాధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజలకు దొంగ హామీలు ఇచ్చి గద్దెనెక్కి రాష్ట్రాన్ని ఆగమాగం చేస్తున్నదన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉంటేనే సాధ్యపడుతుందని తెలి పారు.

గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ నగేశ్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రావు, మాజీ జడ్పీటీసీ సైదిరెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, రామకోటి రెడ్డి, వెంకట రంగారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శీను, సైదయ్య, నరేశ్, గోవిందరెడ్డి, సైదా, ఉపేందర్, లాలయ్య, ఆరోను పాల్గొన్నారు.

## డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

రామగిరి, ఏప్రిల్ 10 : నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 11 నుంచి జరుగాల్సిన డిగ్రీ థియరీ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి జి.ఉపేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11, 15, 16న జరిగే పరీక్షలను మాత్రమే వాయిదా వేశామని, ఆ తర్వాత జరిగే పరీక్షలు యథావిధిగా ఉంటాయని పేర్కొన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు గమనించాలని సూచించారు. వాయిదా వేసిన పరీక్షలను మే 13, 14, 15 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

## అకాలం వర్షం.. తడిసిన ధాన్యం

- గుర్రంపోడ్ మండలంలో పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి



నాగారంలో వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం

మోత్కూరు/గుర్రంపోడ్/నాగారం/ఆలేరు రూరల్, ఏప్రిల్10 : అకాల వర్షం అన్నదాతను అతలాకుతలం చేసింది. ఉమ్మడి జిల్లాలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం తీవ్ర నష్టం కలిగించింది. కొనుగోళ్ల కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. పలుచోట్ల వరదకు కొట్టుకుపోయింది. వారం రోజుల్లో కోతకు వచ్చిన వరిపొలాలు వర్షానికి నేలవాలాయి. చేతికి అంది వచ్చిన ధాన్యం తడవడం, కొట్టుకుపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మోత్కూరు, ఆత్మకూర్(ఎం), గుండాల, అడ్డగూడూరు, సంస్థాన్ నారాయణపురం మండలాల్లో వర్షానికి ధాన్యం తడిసింది. నాగారం మండలం వర్ధమానుకోటలో ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. గుర్రంపోడు మండలంలో వర్షానికి ధాన్యం తడిసింది. ఆమలూరు గ్రామంలో పిడుగుపాటుకు గొర్రెల కాపరి మేకల చిన్న రాములు(65) మృతిచెందాడు. ఆలేరు మండలం మంతపురిలో పిడుగుపడి పాడిగేదె మృత్యువాత పడింది.

**మధ్యాహ్నం ఎండ.. సాయంత్రం వాన**

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 11 : వాతావరణంలో విచిత్ర మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గురువారం జిల్లాలో 40 డిగ్రీలకుపైనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ తీవ్రతకు జనం బయటకు వెళ్లేందుకు భయపడ్డారు. ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు. కానీ సాయంత్రం వచ్చే సరికి వాతావరణం చల్లబడింది. ఈదురుగాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. యాదాద్రి జిల్లా అడ్డగూడూరులో 40.9, సంస్థాన్ నారాయణపురంలో 40.8, సగటున 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం తర్వాత పలు మండలాల్లో వర్షం కురిసింది. ఆలేరు మండలం శారాజీపేటలో 20.5, అడ్డగూడూరులో 10.8, ఆత్మకూరు (ఎ0)లో 8.8, గుండాలలో 6.3, యాదగిరిగుట్టలో 4, మోటకొండూరులో 2.5, మోత్కూరు దత్తప్పగూడెంలో 1 మిల్లీమీటర్ల వర్షం పడింది.



మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌లో వర్షానికి కొట్టుకుపోతున్న ధాన్యం



బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు

## బీఆర్ఎస్ రజతోత్సవానికి పెద్ద ఎత్తున తరలి రావాలి

- హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- సీఎం రేవంత్‌రెడ్డి కుట్రలను తిప్పికొట్టాలి
- ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, ఏప్రిల్10 : ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు పెద్ద ఎత్తున తరలిరావాలని, ఆలేరు నియోజకవర్గం నుంచి 15 వేల మంది పార్టీ శ్రేణులు, అభిమానులు వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలని ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. యాదగిరి గుట్ట పట్టణంలోని గొంగిడి నిలయంలో గురువారం బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ రజతోత్సవాన్ని జయప్రదం చేసి తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని అన్నారు. సభ అనంతరం ఆన్‌లైన్ సభ్యత్వ నమోదుకు కొత్త కమిటీలు ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు. 2014లో పాలన పగ్గాలు చేపట్టిన బీఆర్ఎస్ పార్టీ.. అభివృద్ధి, సంక్షేమంలో దేశంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారని అన్నారు. ఆరు గ్యారంటీలంటూ ఊదరగొట్టి 16 నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను అటకెక్కించిందని విమర్శించారు. మహిళలకు రూ. 2,500, పింఛన్ల పెంపు, తులం బంగారం, ఆడపిల్లలకు స్కూటీలు వంటి పథకాలు ఎటుపోయాయని అన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత ఉందన్నారు. తెలంగాణ నుంచి కేసీఆర్ పేరును చెరిపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ యువజన విభాగం మండల ప్రధాన కార్యదర్శి బీమగాని నర్సింహగౌడ్, మాజీ కౌన్సిలర్ ఆవుల సాయి. పట్టణ అధ్యక్షుడు ముక్యర్ల సతీశ్ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ మారెడ్డి కొండల్‌రెడ్డి, బీసీ విభాగం మండలాధ్యక్షుడు కవిడె మహేందర్, నాయకులు మిట్ట వెంకటయ్య, గుండ్లపల్లి వెంకటేశ్‌గౌడ్, కోన్యాల నర్సింహారెడ్డి, అంకం నర్సింహ, మాటూరి బాలయ్య, ఆరె స్వామి, చిత్తర్ల బాలయ్య, శిఖ శ్రీనివాస్, గుణగంటి బాబురావు, పేరబోయిన సత్యనారాయణ, శారాజీ రాజేశ్ యాదవ్, గడ్డం చంద్రం తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండ జిల్లాలో నెల రోజులు పోలీస్ యాక్ట్

- ఎస్పీ శరత్ చంద్ర పవార్

నీలగిరి, ఏప్రిల్ 10 : శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని శుక్రవారం నుంచి నెల రోజులపాటు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలు చేస్తున్నట్లు నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా, ప్రజా ధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదని పేర్కొన్నారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని తెలిపారు.